జీపీ పాలకవర్గం రాజీనామా

రాజీనామా చేయాలని సర్పంచ్ భర్తపై రైతులు దాడి



రాజీనామా చేసిన పాలకవర్గ సభ్యులు

నవతెలంగాణ-సదాశివనగర్

మాస్టర్‌ప్లాన్‌లో భూములు కోల్పోతున్నానని ఆవేదనతో రైతు ఆత్మహత్య చేసుకోవడంతో మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి జీపీ పాలకవర్గం రాజీనామా చేసింది. ఉప సర్పంచ్‌తో సహా వార్డు సభ్యులు రాజీనామా చేశారు. అయితే సర్పంచ్ సైతం రాజీనామా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనలో పాల్గొన్న సర్పంచ్ భర్త పైడి జనార్ధన్‌పై పలువురు దాడి చేశారు. సర్పంచ్‌ను సైతం రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. పోలీసులు చేరుకొని శాంతింపజేశారు.

అనుదినం జనపక్షం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి 1

శుక్రవారం 06 జనవరి 2023

క్రీడా ప్రాంగణాలను వారం రోజుల్లో పూర్తి చేయాలి

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని పంచాయతీలు గ్రామీణ క్రీడా ప్రాంగణములను వారం రోజులలో పూర్తిచేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రెటరీలు, ఉపాధ్యాయ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 5ఎకరాలలో నిర్మించనున్న బృహత్ పల్లె ప్రకృతి వనాలకు గాను 4 పంచాయతీలను ఎంపిక చేయగా చిల్లేర్గి, అన్నారం, పిట్లం, పంచాయతీలలో పూర్తయినప్పటికీ బండాపల్లి పంచాయతీలో వివాదాస్పదం కాదా తిరిగి ధర్మారం గ్రామ పంచాయతీని ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. త్వరలో చేపట్టనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీఓ బ్రహ్మం, ఏపీవో శివకుమార్ పాల్గొన్నారు.

'వాల్టా'కు తూట్లు..

- చట్టం అమలుపై అనాసక్తి
- ఇష్టారీతిన బోర్ల తవ్వకాలు
- నిబంధనలు గాలికొదులుతున్న బోరు బండిల యజమానులు
- రిజిస్ట్రేషన్‌కూ మీనమేషాలు..

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి





నీరు, భూమి, వృక్షాల పరిరక్షణకు తీసుకొచ్చిన వాల్టా చట్టం జిల్లాలో నీరుగారుతోంది. చట్టాన్ని పరిరక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో అనుమతులు లేకుండా ఇష్టారీతిన బోర్లు వేయడం ఆనవాయితీగా మారింది. అనుమతులు లేకుండా కనీసం అధికారులకు సమాచారం ఇవ్వకుండా బోర్ల తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించాల్సిన భూగర్భ, రెవెన్యూ శాఖలు ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయి. ఫలితంగా వాల్టా చట్టం ఉల్లంఘనకు గురవుతోంది. భూగర్భ జలాలను కాపాడుకోడానికి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2002లో నీరు, భూమి, వృక్షాల ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది.

వాల్టా చట్టం ఇలా...

నీరు, భూమి, వృక్షాల సంరక్షణకు రూపొందించిన ప్రత్యేక చట్టాన్ని పక్కాగా అమలు చేయాల్సిన అవసరముంది. వాటర్ ల్యాండ్ ట్రీస్ ఆక్ట్ (వాల్టా)గా రూపొందించిన చట్టం అమలు కావడం లేదు. ఈ చట్టం బోరు బావులకు సంబంధించిన అనేక నిబంధనలను తయారు చేసింది. ఎవరైనా సరే బోరు బావి తవ్వుకోవాలంటే ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. సర్వే నంబరు ఆధారంగా రెవెన్యూ సిబ్బంది బోరు వేసే ప్రాంతాన్ని పరిశీలిస్తారు. తదుపరి ఆ దరఖాస్తును భూగర్భ జల వనరుల శాఖకు పంపుతారు. అక్కడి సాంకేతిక ఇంజినీరు సర్వే చేసి ఆ ప్రాంతంలో నీరు పడుతాయని ధృవీకరిస్తే అప్పుడు బోరు వేసుకోవడానికి అనుమతినిస్తారు. ఒక వేళ బావిలో నీరు పడకపోతే ఆ బావిని పూర్తిగా పూడ్చివేయాలి. ఇంత పకడ్బందీగా వాల్టా చట్టం రూపొందించినప్పటికీ అమలు పట్టించుకోవడం లేదు. ఇంట్లో వేసుకునే బోర్లకు సైతం అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో బోరుబోవులకు సంబంధించి నీటి లభ్యతను సాంకేతిక సాయంతో గుర్తించాల్సిన భూగర్భజల శాఖకు ఎలాంటి దరఖాస్తులు రావడం లేదు. ఫలితంగా ఇటు రైతులు నష్టపోతున్నారు. నీటి లభ్యతకు సంబంధించి పక్కా సమాచారం లేకపోవడంతో రైతులు ఎక్కడపడితే అక్కడ బోర్లు వేసి ఆర్థికంగానే నష్టపోతున్నారు. అయితే ఈ చట్టంలో భూగర్భ జల అధికారులకు చర్యలు చేపట్టడానికి ఎలాంటి అధికారాలు లేవని సంబంధిత శాఖ అధికారులు చెప్తున్నారు. కేవలం రెవెన్యూ అధికారులు మాత్రమే చర్యలు తీసుకునే అవకాశం ఉందని చెప్తున్నారు.

నిబంధనలు గాలికి..

పక్కాగా రూపొందించిన వాల్టా చట్టం ఉల్లంఘనకు గురవుతోంది. నిబంధనల ప్రకారం ఒక బోరు తవ్వాలంటే ముందుగా సంబంధిత మండలాల తహసీల్దార్ల వద్ద అనుమతి తీసుకోవాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, భూగర్భ జల శాఖ అధికారులను సంప్రదించి అనుమతులు తీసుకున్న తర్వాత బోరు తవ్వాల్సి ఉంటున్నప్పటికీ అమలుకావడం లేదు.

నిబంధనలను గాలికి వదులుతున్న బోరు బండి యజమానులు

వాల్టా చట్ట అమలులో బోరు బండ్ల యజమానులు కీలక పాత్ర వహించాల్సి ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో దరఖాస్తుదారులకు అవగాహన కల్పించి అనుమతి తీసుకోవాలని సూచించాల్సిన బోరు యజమానులు తమ లాభాల కోసం ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిన బోర్లు తవ్వుతున్నారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో 1200 పైగా బోరుబండ్లు ఉన్నాయి. జిల్లాలో ఉన్న ఈ బోరుబండ్ల యజమానులు ప్రతి సంవత్సరం భూగర్భజల శాఖ వద్ద తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కానీ భూగర్భజల శాఖ అధికారులు పలుమార్లు సూచనలు చేస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో అధికారులను సైతం ఖాతరు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇష్టారీతిన తవ్వకాల వల్ల భూగర్భ జలాలకు నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికైనా భూగర్భ జలాలు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వాల్టా చట్టం పక్కగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.



బారికేట్‌లు తొలగిస్తూ చొచ్చుకువస్తున్న రైతులను నిలవరిస్తున్న పోలీసులు

మాస్టర్‌ప్లాన్ మాకొద్దు..

- రణరంగంగా కామారెడ్డి.. ఉదయం నుంచి టెన్షన్ టెన్షన్
- కలెక్టరేట్ వద్ద తీవ్ర తోపులాట..
- కుటుంబాలతో రైతన్న ఆందోళన
- విపక్షాల మద్దతు
- రైతు ఆత్మహత్యతో కంటలుతెచ్చుకున్న ఆగ్రహం
- అభ్యంతరాలు స్వీకరిస్తాం : కలెక్టర్



కుటుంబీకులతో కలిసి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న రైతులు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, కామారెడ్డిటౌన్

కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌పై రైతులు చేపట్టిన ఆందోళన తీవ్రరూపం దాల్చింది. కామారెడ్డి పట్టణం రణరంగంగా మారింది. ప్రశాంతంగా ఉండే నూతన కలెక్టరేట్ కార్యాలయం రైతన్న ధర్నాతో దద్దరిల్లింది. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు రైతులు యత్నించడంతో పోలీసులకు, రైతులకు మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. ఓ దశలో పోలీసు బారీకేడ్లను రైతులు తోసేశారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. ముగ్గురు రైతులకు గాయాలయ్యాయి. జిల్లా కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీనివ్వాలంటూ రైతులు భీష్మించుకూర్చున్నారు. రాత్రి వరకూ ధర్నా సాగింది. రైతుల ఆందోళనకు బీజేపీ, కాంగ్రెస్ ఇతర విపక్ష నాయకులు మద్దతు తెలిపారు.



వర్షపు నీటిని ఆదా చేసి భూగర్భ జలాలను పెంచుకోవాలి

- జిల్లా భూగర్భ జలాల శాఖ అధికారి సతీష్ యాదవ్



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న సతీశ్ యాదవ్

నవతెలంగాణ-రామారెడ్డి

వర్షపు నీటిని ఆదా చేసి, భూగర్భ జలాలను పెంచుకోవాలని, నీరు సైకిల్ చక్రం లాంటిదని జిల్లా భూగర్భ జలాల శాఖ అధికారి సతీష్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో భూగర్భ జలాలపై గ్రామస్థాయి అధికారులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. పూర్వం బావులు ఉండేవని, వర్షాధార పంటలు ఎక్కువగా సాగు చేసేవారని, రాను రాను గొట్టపు బావులు రావడం, జనాభా పెరుగుదలతో, బీడు భూములు సాగు చేయటంతో నీటి వినియోగం పెరిగిందని, భూగర్భ జలాలు పెంచుకొనడానికి చెక్ డ్యాములు, కందకాలు, బంధాలు, పార్కులేషన్ ట్యాంక్, బోర్వెల్ రీఛార్జిలతో భూమిలోకి నీటిని ఎలా ఇంకించాలో ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం అధికారి వినాయక మాట్లాడుతూ... రిలయన్స్ ఫౌండేషన్ కార్యక్రమాలు, నీటి బడ్జెట్, ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏపీవో ధర్మారెడ్డి మాట్లాడుతూ... ఉపాధి హామీ పనుల్లో భూగర్భ జలాలు పెంచుకునే పనులు, పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీ ఓ సవిత రెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు వితరణ



ఆటవస్తువులు అందజేస్తున్న దాత, హెచ్ఎం

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ప్రవాస భారతీయుడు దాత విలువైన ఆటవస్తువులను వితరణ చేసినట్టు జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు బస్వంత్ పటేల్ తెలిపారు. గురువారం హెచ్ఎం మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రవాస భారతీయులు ఏనుగు దయానంద్‌రెడ్డి 50మంది విద్యార్థులకు గానూ రూ.55వేల విలువైన స్పోర్ట్స్ డ్రెస్‌లు, 23 వాలీబాల్‌లు, రెండు నెట్లు, నాలుగు కోకో పోల్స్ ఉచితంగా ప్రదానం చేశారని తెలిపారు. ఇందుకు గాను సహకరించిన వారికి స్థానిక సర్పంచ్ బొంపెలి రాములు, బీఆర్ఎస్ నాయకులు నీలుపటేల్, గంగాధర్, హెచ్ఎం బస్వంత్, పాఠశాల ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.

మండల స్థాయి క్రికెట్ వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలో యూత్ డే సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ఆదేశాల మేరకు మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రికెట్ వాలీబాల్ క్రీడలను నిర్వహిస్తు న్నట్టు ఎస్ఐ విజయ్ కొండ తెలిపారు. శుక్రవారం రోజున సాయంత్రం 6 గంటల వరకు ఆసక్తి ఉన్న యువకులు విద్యార్థులు వారికి సంబంధించిన గ్రామాల నుంచి వారి జట్టు వివరాలను పోలీస్ స్టేషన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. 7,8 తేదీల్లో క్రీడలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కావున ఆసక్తి ఉన్న యువకులు వారి పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

- భూపోరాటాన్ని ఉధృతం చేస్తాం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-సదాశివనగర్



మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

మాస్టర్ ప్లాన్‌తో తమ భూములు కోల్పోతున్నామనే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. మాస్టర్‌ప్లాన్‌పై అనేక సందేహాలు రైతులకు వ్యక్తమవుతున్నాయని, బాధిత రైతులతో సమావేశం నిర్వహించి వారి సందేహాలు నివృత్తి చేసి అందరికీ ఆమోదయోగ్యమయ్యే విధంగా ప్లాన్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. గురువారం సదాశివనగర్ మండలంలోని మల్లన్నగుట్ట వద్ద పార్టీ ఎల్లారెడ్డి ఏరియా కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి మున్సిపల్ మాస్టర్ ప్లాన్ ప్రకారం సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన రైతు పయ్యావుల రాములు తన భూమి మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇండస్ట్రీస్ జోన్ పరిధిలోకి వెళ్తే భూమి పోతుందని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని, మున్సిపల్ అధికారుల తప్పుడు ప్రచారం వల్ల అనేక మంది పేదలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులు మాస్టర్ ప్లాన్‌పై స్పందించి సమస్యలు పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. మరణించిన రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, 25 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

భూ పోరాటన్ని ఉధృతం చేస్తాం

రాబోయే కాలంలో భూమికోసం స్థానిక సమస్యల పరిష్కారం కోసం, కార్మికుల హక్కులు కాపాడుట కోసం పోరాడాలని పోరాడకపోతే దళారులు దోపిడి దారుల నుండి పేదవాళ్లకు రక్షణ కరువవతోందని వెంకట్‌గౌడ్ అన్నారు. ఈ దేశంలో బతకాలంటే హక్కులు కాపాడుకోవాలంటే భూములు దక్కించుకోవాలంటే... ప్రతి పేద దళితులు గిరిజనలు, మహిళలు, విద్యార్థి, మేధావులు సీపీఐ(ఎం) జరిపే పోరులో కలిసి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కోర్ కమిటీ సభ్యులు మోతీరాం నాయక్, చంద్రశేఖర్, నాయకులు కమ్మర్ సాయిలు, మధు, మొగులయ్య వెంకన్న మల్లేష్ రెడ్డి, మధు, పిడుగు నరసింహులు, కడెం రాజయ్య గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీల మంజూరుకు కృషి చేశా

- వేగంగా కొనసాగుతున్న రైల్వేఓవర్ బ్రిడ్జి పనులు
- అభివృద్ధిలో దేశానికి తెలంగాణ ఆదర్శం
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-భీంగల్/వేల్పూర్



భీంగల్ : శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేముల



వేల్పూర్ మండలం లక్కోరాలో

జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జిల మంజూరు కోసం రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖా మంత్రిగా తనవంతు బాధ్యతను గుర్తెరిగి ఈ దిశగా కృషి చేశానని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. గురువారం భీంగల్, వేల్పూర్ మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. నిజామాబాద్ శివారులోని మాధవనగర్ ఆర్.ఓ.బీ తో పాటు, అర్సపల్లి, సారంగపూర్, నవీపేట్, ఇందల్వాయిల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాల కోసం నాలుగు పర్యాయాలు కేంద్ర మంత్రికి, రైల్వే బోర్డుకు లేఖలు రాశానని తెలిపారు. ఫలితంగా అర్సపల్లి ఆర్.ఓ.బీ మంజూరయ్యిందని, ఇది ఎంతో సంతోషాదాయకమని అన్నారు. ప్రజల చిరకాల వాంఛ అయిన మాధవనగర్ ఆర్.ఓ.బి నిర్మాణానికి సైతం తాను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం తరపున చేపట్టాల్సిన పనులకు నిధులు మంజూరు చేయించానని అన్నారు. మాధవనగర్ ఆర్.ఓ.బీ కి మొత్తం రూ. 93 కోట్ల నిధులు అవసరముండగా, అందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.63 కోట్లు ఖర్చు చేస్తోందని, గడిచిన రెండు నెలలుగా పనులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తరపున చేపట్టాల్సిన పనులు ఇంకనూ ప్రారంభం కావాల్సి ఉన్నాయని తెలిపారు. మాధవనగర్, అర్సపల్లి తరహాలోనే మిగతా మూడు ఆర్.ఓ.బీ ల మంజూరుకు సమిష్టిగా కృషి చేద్దామని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి జిల్లా ప్రజాప్రతినిధులకు సూచించారు.

అభివృద్ధిలో యావత్ దేశానికి తెలంగాణ ఆదర్శం

అన్ని వర్గాల వారికి మేలు చేకూరుస్తూ, పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్రం యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. దేశమంతా ఆశ్చర్యపోయేలా తెలంగాణలో ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలను నిర్విఘ్నంగా అమలు చేస్తున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇక్కడి సంక్షేమాభివృద్ధిని చూసి ఇతర రాష్ట్రాల ప్రజలు సైతం తెలంగాణ తరహా పాలనను కోరుకుంటున్నారని మంత్రి అన్నారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను స్వాగతిస్తుండడం తెలంగాణలో సంక్షేమ పాలనకు అద్దం పడుతోందన్నారు.

మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బాల్కొండ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ సుమారు రూ. 13.50 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. భీంగల్ మండలం జగిర్యాల్ గ్రామంలో రూ. 20 లక్షలతో హెల్త్ సబ్ సెంటర్ కు, రూ. 40 లక్షలతో జాగిర్యాల్ నుండి కుప్కాల్ తండా వరకు బిటి రోడ్ పునరుద్ధరణ పనులకు, రూ. 1.50 కోట్లతో కుప్కాల్ నుండి భీంగల్ వయా గెస్ట్ హౌస్ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. అలాగే, రూ. 1.60 కోట్లతోకుప్కాల్ నుండి దోన్పాల్ రోడ్ పునరుద్ధరణ పనులకు, రూ. 20 లక్షలతో బెజ్జోరాలో నూతన హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణానికి, బెజ్జోరా నుండి లింగాపూర్ చౌట్ వరకు రూ. 1.60 కోట్లతో బిటి రోడ్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపనలు జరిపారు. వేల్పూర్ మండలం పడగల్ నుండి పోచంపల్లి వరకు రూ. 95 లక్షలతో బిటి రోడ్ మరమ్మత్తుల పనులకు, లాక్కోరా లో రూ. 20 లక్షలతో నూతన హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా రూ. 7 కోట్లతో నూతనంగా నిర్మించిన ఎస్‌డబ్ల్యూసీ (స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్) 10000 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్ ను మంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఏ గ్రామానికి ఎం చేయాలన్నది గుర్తెరిగిన ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు ప్రకటించారు. ప్రజలు వాస్తవాలను గమనించాలని, సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్న తమ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా శివసాయి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భీంగల్ జెడ్పీటిసి చౌట్‌పల్లి రవి, యంపిపి ఆర్మూర్ మహేష్, సర్పంచ్‌లు మానస శ్రీనివాస్, విజయలక్ష్మిగుణ్‌వీర్‌రెడ్డి, యంపిటీసి సుమలత రాజేశ్వర్‌తో పాటు పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, ఏయంసీ చైర్మన్ గుణవీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు తిప్పండి

- విద్యార్థులు కిక్కిరిసి ప్రయాణం చేస్తుండటంతో చలించిన స్పీకర్



బస్సులో కిక్కిరిసి ప్రయాణిస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న స్పీకర్

నవతెలంగాణ-బాన్సువాడ

స్కూల్‌కు వెళ్లేందుకు విద్యార్థులు కిక్కిరిసి ప్రయాణం చేస్తుండటాన్ని గమనించి చలించిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. వారి సౌకర్యార్థం మరో బస్సు ఏర్పాటు చేయించారు. వివరాల్లోకి వెళ్తే.. బాన్సువాడ నుండి కొత్తాబాది గ్రామంలోని మోడల్ స్కూల్‌కి విద్యార్థులతో వెళ్తున్న బస్సును కొయ్యగుట్ట చౌరస్తాలో స్పీకర్ పోచారం ఆపి పరిశీలించారు. బస్సులో నిండుగా, కిక్కిరిసి ఉన్న విద్యార్థులను చూసి వెంటనే బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఫోన్లో మాట్లాడారు. తక్షణమే నేటి నుంచే విద్యార్థులకు అవసరమైన అదనపు బస్సులను నడిపించాలని ఆదేశించారు. తమ ఇబ్బందులను గమనించి వెంటనే పరిష్కరించిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి విద్యార్థులు చప్పట్లు కొట్టి ధన్యవాదాలు తెలిపారు.

బాలికపై లైంగికదాడి

నవతెలంగాణ-ఆర్మూర్



అభం శుభం తెలియని బాలికపై లైంగికదాడి జరిగిన ఘటన నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలంలోని దేగాం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వ సనీయ సమాచారం మేరకు.. దేగాంలో ఓ ఇటుకల బట్టిలో మహారాష్ట్రకు చెందిన కుటుంబ సభ్యులు పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి పది సంవత్సరాల వయసు గల ఓ బాలిక ఉంది. పొలంలో నాట్లు వేసేందుకు ఇటీవల బీహార్ నుంచి సుమారు 30 మంది యువకులు వచ్చి వీరు ఉంటున్న ప్రాంతంలోనే నివసిస్తున్నారు. ఈనెల 2వ తేదీన రాత్రి 8 గంటల ప్రాంతంలో మహారాష్ట్రకు చెందిన కుటుంబం నివసించే ఇంట్లోకి బిహార్‌కు చెందిన ఓ యువకుడు వచ్చి చిన్నారి బాలికను కిరాణా దుకాణానికి రమ్మని చెప్పి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బయటకు వెళ్లిన యువకుడు రాత్రి 11 గంటలైనా రాకపోవడంతో మిగతా యువకులు వెతకగా.. శివారు ప్రాంతంలో కనిపించారు. యువకులు నిందితుడిపై దాడి చేసి రూమ్‌కు తీసుకెళ్లారు. బాలికకు తీవ్ర రక్తస్రావం కాగా.. ఆర్మూర్‌లోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తేనే వైద్యం చేస్తామని వైద్యులు వెల్లడించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇలా పలు ఆస్పత్రులకు వెళ్లినా అదే సమాధానం రావడంతో తిరిగి దేగాం గ్రామానికి వచ్చారు. విషయం గ్రామస్తులకు తెలియడంతో బీహార్‌కు చెందిన యువకుడిని చితకబాదిలో గదిలో బంధించినట్టు సమాచారం. లైంగికదాడి విషయం పోలీసులకు తెలిస్తే ప్రమాదమని భావించి.. వారిని తీసుకొచ్చిన దేగాం వ్యక్తులతో పాటు బీహార్ నుంచి వచ్చిన యువకుల బృందం ఆందోళన చెందారు. మంగళవారం రాత్రి బాలికకు ఆర్మూర్‌లో చికిత్స చేయిస్తామని ఆటోలో తరలించినట్లు ఆలస్యంగా తెలిసింది. అత్యాచారానికి గురైన బాలికకు చికిత్స చేయిస్తే పోలీసులకు విషయం సమాచారం అందుతుందని భావించి మహారాష్ట్రకు చెందిన బాధిత కుటుంబానికి భయభ్రాంతులకు గురి చేశారు. అత్యాచారానికి విలువ కట్టి రూ. ఐదారు వేలిచ్చి గ్రామం విడిచి వెళ్లిపోయేలా చేసినట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదూ రాలేదని తెలిపారు.

దంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డాక్టర్ శీను నాయక్ అధ్వర్యంలో మండలంలోని కోరట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉచిత దంత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. డాక్టర్లు 150 మంది విద్యార్థులకు 4 పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దంతాల సంరక్షణ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు.అనంతరం పలు సూచనలు సలహాలు అందజేశారు.



విండో మాజీ చైర్మన్, మాజీ సీఈవో అరెస్ట్ రిమాండ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని బ్రాహ్మణపల్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ కాట్పల్లి గంగారెడ్డి, మాజీ సీఈవో సామ సురేందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ శ్రీకాంత్ గురువారం తెలిపారు. బ్రాహ్మణపల్లి సొసైటీలో 2011 నుండి 2020 వరకు ఉన్న సొసైటీ చైర్మన్, సెక్రెటరీ పాలకవర్గ సభ్యులు, సొసైటీ సంబంధించిన సుమారు 88,72,256 లక్షలు డబ్బులు వాడుకుని నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ప్రస్తుత చైర్మన్ అన్వేష్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ కేసు డిచిపల్లి సీఐ విచారణ చేసి గురువారం మాజీ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డిని మరియు మాజీ సీఈవో సామ సురేందర్ ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారని అన్నారు. తదుపరి విచారణ కొనసాగుతోందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు ..

పేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

- సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గణేష్ గుప్తా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిరుపేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. గురువారం 20 మంది బాధితులకు 11,65,500 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులని క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల బస్తీ దవాఖానాలో రక్త, మూత్ర ఇతర రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ప్రయివేట్ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందుతునందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయాన్నీ అందిస్తున్నాము. కార్యక్రమంలో నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత,రెడ్కో మాజీ చైర్మన్ ఎస్ ఏ అలీం బి ఆర్ ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ క్రీడాకారులను సన్మానించిన ఎమ్మెల్యే

34వ హాండ్ బాల్ ఫెడరేషన్ కప్ ఛాంపియన్‌షిప్ టోర్నీ జనవరి 9 నుండి 13 వరకు జైపూర్‌లో ఈ టోర్నీకి నిజామాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు సుప్రియ, భావన, నిశిత, మనోజ్ఞ తెలంగాణ రాష్ట్రం తరపున ఆడనున్నారు. టోర్నీలో మంచి ప్రదర్శన కనబర్చి నిజామాబాద్ జిల్లాకు తెలంగాణ రాష్ట్రానికి కీర్తి తీసుకరావలని క్రీడా కారులను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల సన్మానించారు. కార్యక్రమంలో నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, టీఎస్ రెడ్కో మాజీ చైర్మన్ ఎస్ ఎ అలీం, మాజీ మేయర్ ఆకుల సుజాత, ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు మహమ్మద్ యసీన్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

బూత్ కమిటీల ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని పార్టీ అధ్యక్షులు మీసాల మధుకర్ రావు ఆధ్వర్యంలో గురువారం ధర్మారం, ధర్మారం తండాలో గ్రామ శాఖ అధ్యక్షులు నవీన్, శివలాల్ నాయక్ సూచనల మేరకు బూత్ కమిటీలను వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ బొల్లెంక సుమలత గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, బీఆర్ఎస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, మైనారిటీ సెల్ అధ్యక్షులు జమీర్ ఖాన్, సొసైటీ చైర్మన్ శ్రీధర్, సర్పంచ్లు రాంగోపాల్ రెడ్డి, గంగారం, బూత్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచులు శ్రీనివాస్, సంగ్యా నాయక్, సంతోష్, రామ్ చందర్, ప్రకాష్ కార్యకర్తలు పాల్గొన్నారు

రోడ్డు పనులకు భూమిపూజ



రోడ్డుపనులు ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

మండలంలోని గుండారం గ్రామంలో జడ్పీటీసీ బొల్లెంక సుమలత గోపాల్ రెడ్డి నిధుల నుండి 6 లక్షల రూపాయలు వెచ్చించి నూతన రోడ్డు నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మారావు, ఎంపీటీసీ అంకల గంగాధర్, పీఏసీఎస్ చైర్మన్ దాసరి శ్రీధర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు ఉమపతి, మండల ఉప అధ్యక్షులు నాగశెట్టి గంగాధర్, ఉపసర్పంచ్, మైనార్టీ సెల్ అధ్యక్షులు జమీర్ ఖాన్, వీడీసీ అధ్యక్షులు శేఖర్, క్యాషియర్ రాజా రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

శ్రీ శివసాయి ఆస్పత్రి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ పట్టణంలోని శ్రీ శివసాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి 2023 క్యాలెండర్‌ను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం ప్రారంబించారు. నియోజకవర్గంలో శివసాయి ఆసుపత్రి ఆధ్వర్యంలో అందజేస్తున్న ఉచిత వైద్య సేవలకు గాను డైరెక్టర్ సాయి కుమార్ యాదవ్‌ను అబినందించారు . కార్యక్రమంలో డాక్టర్లు సూర్యనారాయణ, సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు స్కీమ్‌వర్కర్ల నిరసన కార్యక్రమాలు

- 18నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల రిలేదీక్షలు
- ఎంఈవోకు సమ్మెనోటీసు అందజేత

నవతెలంగాణ-సిరికొండ

నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 06న స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు, ఇతర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసంధానంగా ఉన్న కార్మికులందరూ మండల కేంద్రాల్లో నిరసర కార్యక్రమాలు చేపడుతున్నట్టు గురువారం మండల విద్యాధికారికి సమ్మెనోటీసు అందజేశారు. ఈనెల 18 నుండి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామని తెలిపారు. 3000 వేతనానికి సంబంధించిన జీవో ఇంతవరకు రిలీజ్ చేయలేదని, పెంచిన స్లాబ్ రేటు జీవో విడుదల చేయాలని, అక్టోబరు నవంబరు, డిసెంబర్ బకాయి బిల్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసమస్యలపై ప్రతిరోజు ఒక్క మండలం చొప్పున మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేస్తూ రిలే నిరాహార దీక్షలు జిల్లా కేంద్రం నిజామాబాదులో చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో తోపునూర్ చక్రపాణి జిల్లా ప్రధాన కార్యదర్శి, లక్ష్మణ్, లక్ష్మి, ప్రమీల, బుచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



అలుక కిషన్‌ను సన్మానించిన దళిత సంఘాల నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షులు అలుక కిషన్‌కు నిజామాబాద్ జిల్లా పలు దళిత సంఘ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు(మహార్ శౌర్య దివస్) తెలిపారు. ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా మాల మానాడు నాయకులు, దళిత జర్నలిస్టుల నాయకులు, దళిత బహుజన ఫోరం సభ్యులు, జిల్లా టిఎన్జీవోస్ అధ్యక్షుడు అలుక కిషన్‌ను కలిసి శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్టు దళిత బహుజన ఫోరం రాష్ట్ర కన్వీనర్ నాయుడు రాజు తెలిపారు. కార్యక్రమంలో ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంగరి ప్రదీప్, జిల్లా మాల మహానాడు అధ్యక్షులు చిట్టెటి మోహన్ రావు, సీసీ బ్యాంక్ డైరెక్టర్ గోర్కంటి లింగన్న, దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ ఎడ్ల సంజీవ్, దళిత బహుజన ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ నాయుడు రాజు, ఎస్సి ఎస్టీ విద్యార్థి సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు అబ్బి ప్రగతి కుమార్, అంసా రాష్ట్ర కార్యదర్శి తర్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యం కోసమే టీఎల్ఎమ్ మేళా



ముప్కాల్‌లో...



ధర్పల్లిలో..

నవతెలంగాణ-ముప్కాల్/ధర్పల్లి

విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించడానికి మండల స్థాయిలో 'ఎఫ్ఎల్ఎన్-టీఎల్ఎమ్' మేళా గురువారం ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఏ విధంగా బోధించాలో మెటీరియల్ మోడల్స్‌ను ఏర్పాట్లు చేశారు. ఈ మెటీరియల్ మోడల్స్ లో ఉత్తమమైన వాటిలో నాలుగు మోడల్స్‌ను ఎంపిక చేసి ఈ నెల 6న జిల్లా కేంద్రంలో నిర్వహించి, జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వాటి నుంచి మరో నలుగురిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో చేపట్టే రాష్ట్ర టీఎల్ఎమ్ మేళాలో ప్రదర్శించనున్నట్లు మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ, సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దం నర్సారెడ్డి, మండల విద్యాధికారి రాజేశ్వర్, నిర్వహణ అధికారి మనోహర్, ఎఫ్ఎల్ఎన్-టీఎల్ఎమ్ మేళా పరిశీలకులు బోయడా నర్సయ్య, యూ.నటరాజు, ఆయా ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

ధర్పల్లి :తొలిమెట్టులో భాగంగా గురువారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన బోధన పరికరాల ప్రదర్శనను ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మౌలిక భాష, గణిత సామర్థ్యంపై విద్యార్థులకు సులభ విద్య విధానం గురించి ఉపాధ్యాయులు ప్రదర్శనలో వివరించారు. కార్యక్రమంలో ఎండిఓ నటరాజ్, తహసీల్దార్ గంగ సాగర్, సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, ప్రధానోపాధ్యాయులు నారాయణ, ఎస్ఎంసి చైర్మన్ సాయిబాబు, ఉపాధ్యాయులు ప్రసన్న కుమార్, శ్రీనివాస్, అతీనొద్దీన్, శుష్మిత కుమారి,ముత్యం రెడ్డి,తదితరులు పాల్గొన్నారు,

ఎమ్మెల్సీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జాగృతి నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రూరల్ జాగృతి కన్వీనర్ మల్లెల సాయి చరణ్, మండల కన్వీనర్లు సంతోష్, భాస్కర్, మహిపాల్, జయనంద్, విక్కీ, గంగాధర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను హైదరాబాద్‌లో గురువారం కలిశారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ముప్కాల్/కమ్మర్‌పల్లి/డిచ్‌పల్లి

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ముప్కాల్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్యాలెండర్ ను ఎంపీపీ సామ పద్మ జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ, సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దం నర్సారెడ్డి, మండల విద్యాధికారి రాజేశ్వర్, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షురాలు పరశి కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శి బట్టు బద్రీనాథ్, ప్రధానోపాధ్యాయులు గుండోజి నరేందర్, టీపీయూఎస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ - 2023 ను సెక్టోరియల్ ఆఫీసర్ నర్రా రామారావు, మండల విద్యాధికారి ఆంధ్రయ్య చేతుల మీదుగా క్యాలెండరును గురువారం ఆవిష్కరించారు.ార్యక్రమంలో చౌట్ పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కనకం గంగాధర్,తపస్ మండల అధ్యక్షులు సాల్లూరి కిషన్, మండల ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గున్నారు.

డిచ్‌పల్లి:డిచ్‌పల్లి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను మండల విద్యాధికారి రాజగంగారం గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తపాస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అజయ్ కుమార్, శ్రీకాంత్ జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు బద్రి నాథ్, జిల్లా గౌరవాధ్యక్షుడు రాఘవేందర్ రావు, జిల్లా కోశాధికారి రాజేష్ కుమార్, డివిజినల్ కార్యదర్శి మధుసూధన చారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ ధర్పల్లి

మండలంలోని డిబి తండా గాంధీ విగ్రహం నుండి చింతరల్ తండా వరకు, మోహిదీన్‌సాబ్ తండా నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు వేయనున్న రోడ్లను గురువారం ఆర్ అండ్ బి అధికారులు ఏఈ ప్రవీణ్, డీఈ సుధీర్ల్ పరిశీలించారు. వారివెంట డిబి తండా ఎంపిటిసి స్వామి వారివెంట రోడ్లను చూపించారు,కొత్తగా రెండు రోడ్లకు నిధులు కేటాయించిన రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, సహకరించిన జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్, ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

జిల్లా జైలును సందర్శించిన డీఎస్ఎల్ఏ సెక్రటరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి, సీనియర్ సివిల్ జడ్జ్ మతి. పి. పద్మావతి నిజామాబాద్ జిల్లా జైలును గురువారం సందర్శించారు. జైలు లోని బ్యారక్ లను, జైలు పరిసరాలను కిచెన్, స్టోర్ రూం, ప్రింటింగ్ సెక్షన్, అల్మారి తయారి ఫ్యాక్టరి, వంటశాలను సందర్శించారు. వారికి జిల్లా న్యాయ సేవాది కారసంస్థ అందించే న్యాయ సేవలను గురించి వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని న్యాయ సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా జైలు పర్యవేక్షకులు ప్రమోద్, జైలు సిబ్బంది. డి ఎల్ ఎస్ ఏ స్టాఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోనాసముందర్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరించిన చైర్మన్, డైరెక్టర్లు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనసముందర్ సింగల్ విండో కార్యాలయం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను సింగిల్ విండో చైర్మన్ సామబాపురెడ్డి ఆవిష్కరించారు. గురువారం విండో కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పలువురు డైరెక్టర్ల సమక్షంలో క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సామ బాపురెడ్డి మాట్లాడుతూ.. విండో పరిధిలోని రైతులకు అందజేయనునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, డైరెక్టర్లు, విండో కార్యదర్శి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామానికి చెందిన భీమనవోయిన గంగాధర్ కొన్నిరోజులకితం గుండెపోటుతో మృతి చెందడంతో విషయాన్ని తెలుసుకున్న ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ రెడ్డి బాధిత కుటుంబానికి 5000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. సునీల్ యువసేన సభ్యులు గురువారం ఆర్థిక సహాయం ఆ కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో బెజ్జారం భాను,వినోద్ యాదవ్, సునీల్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద గల గాయత్రి బ్యాంక్ ఖాతాదారుడు శ్రీనివాసరావు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా ఆయన తండ్రి రాములుకు లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బ్రాంచి మేనేజర్ రామోజీ లింబాద్రి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఏడో వార్డు కౌన్సిలర్ ఇట్టెడి నర్సారెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కేసీఆర్ నిర్విరామ కృషి

నమస్తే నవనాథపురం కార్యక్రమంలోఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో నమస్తే నవనాతపురం కార్యక్రమంలో గురువారం ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి పాల్గొని పారిశుద్ధ కార్మికులతో కలిసి రోడ్లు ఊడ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గల్లీలో లొల్లి చేస్తూ ఢిల్లీలో నిద్రపోతున్న అరవింద్ అభివృద్ధి నిరోధకుడని అన్నారు. బడుగు, బలహీన, పేద ప్రజల రైతుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం నిర్విరామ కృషి చేస్తుందని, ఆలూర్, డొంకేశ్వర్ మండలాలను చేసి అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. పట్టణ ప్రభుత్వ ఆస్పతిలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ వైస్ చైర్మన్ షేక్ మొన్న ,కౌన్సిలర్లు, పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ నాగరాజు, అమృత్ రాంరెడ్డి, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

టీవీయూవీ క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో టీవీయూవీ 2023 నూతన క్యాలెండరును ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా'వేణు గోపాల్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక విద్యార్థులకు నిరంతరం అండగా ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించడంలో ప్రముఖ పాత్ర వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో టివియువి మండల కన్వీనర్ ఆనంద్, కో కన్వీనర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు..

ఆలూరు సొసైటీ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ఆలూర్ మండలంలోని ఆలూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో 2023 సంఘం క్యాలెండర్‌ను పీయూసీ చైర్మన్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కళ్ళెం భోజ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, సంఘం డైరెక్టర్లు కళ్ళెం సాయ రెడ్డి, బార్ల సంతోష్ రెడ్డి, ఇంగు గోవర్ధన్, సింగేడి మల్లు బాయి , ప్రమోదు కుమార్, అరే రాజేశ్వర్, వెల్మ నర్స రెడ్డి, పచ్చుక లసుం బాయి, కట్ట నర్సయ్య, తంబుర్ శ్రీనివాస్, గొల్ల గంగాధర్, .సంఘం కార్యదర్శి తొర్తి మల్లేష్, సిబ్బంది ముత్యం, దేవ రాజ్, గంగాధర్, గంగారాం, రాజు, రైతులు పాల్గొన్నారు.



ఆలూర్ సొసైటీ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

తూంపల్లిలో వైద్య శిబిరం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని తూంపల్లి గ్రామంలో గురువారం హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని జెడ్ పి టి సి మాన్సింగ్ నాయక్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...నిరుపేదల చికిత్సకోసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ధర్పల్లి సీఐ బానావత్ సైదా మాట్లాడుతూ.. యువత స్వచ్ఛంద సేవ కార్యక్రమాల్లో పాల్గొని సన్మార్గంలో నడవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై నర్సింలు స్థానిక సర్పంచ్ పల్లి బాలమణి మల్లేష్ ఎంపీటీసి, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండర్ శ్రీకాంత్, ఫౌండేషన్ మెంబర్స్ గంగాధర్, వినోద్, మహేష్, రవి, బాలరాజు, నవిన్, నవిన్ గణేష్, గురిజాల హరిష్ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల సమస్యలపై పీఓడబ్ల్యూ నాయకుల సర్వే

నవతెలంగాణ-బోధన్

డ్వాక్రా సంఘాలలో ఉన్న సమస్యలపై ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని తట్టికోట, నాయిబ్రాహ్మణగల్లి, పాన్‌గల్లి, రాకాసిపేట్‌లో గురువారం సర్వే నిర్వహించారు. ప్రభుత్వ మహిళ సంఘాలకు అందించే పావలా వడ్డీ, అభయహస్తం అమలు తీరు వారి ఇతర సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో మహిళలు వారి సమస్యలను వివరించారు. 30 వేల రూపాయలు అప్పు తీసుకుంటే, 30 నెలలు వాయిదాలు కట్టాలని చెప్పారని, కానీ 36 నెలలు కట్టించుకున్నారని సభ్యులు నాయకులకు తెలిపారు. మహిళా సంఘాల సమస్యల పరిష్కారానికి ఉద్యమించడానికి ముందుకు రావాలని పీఓడబ్ల్యూ నాయకులు వారికి సూచించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి, బిపాషా, రెహనా, కే.లక్ష్మి, ఎల్.గంగామణి, పి.సత్యమ్మ, శకుంతల, సుజాత, భాగిర్త, సాయమ్మ డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు సమయానికి పరీక్షలు చేయించాలి

- పీహెచ్‌సీ వైద్యులు సురేష్

నవతెలంగాణ-రామారెడ్డి

గర్భిణులకు సమయానికి ప్రభుత్వ ఆసుపత్రిలో చెక్ చేయించి, పరీక్షలు నిర్వహిస్తూ, వారికి భరోసా కల్పించాలని రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య వైద్యులు సురేష్ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితోపాటు, ఆశాలకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. గర్భిణులకు వైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి సంఖ్యలను పెంచేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు కరుణశ్రీ, సిబ్బంది భీమ్, జానకి, స్వాతి, దోమల శ్రీధర్, శ్రీహరి, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

బట్టు విఠల్‌కు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న విఠల్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన బట్టు విఠల్ ముదిరాజ్‌కు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసినట్టు ఉస్మానియా యూనివర్శిటీ వీసీ రవీందర్ తెలిపారు. యూనివర్సిటీలో పరిశోధకులు పత్రాలను సమర్పించగా, రాజనీతి శాస్త్రంలో ఈ పట్టాను పొందినట్టు ఆయన పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో భాగంగా మహిళలకు సమాన వేతనాలు-ఆర్థిక స్వావలంబన సాధికారత అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. దీనికి గాను ఉస్మానియా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్ యాదవ్ బట్టు విఠల్ ముదిరాజ్‌కు 'డాక్టరేట్ ఆఫ్ ఫిలాసఫీ' పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేశారు. ఇందుకు సహకరించిన గురువులకు, మిత్రులకు, కుటుంబ సభ్యులకు విఠల్ ముదిరాజ్ ధన్యవాదాలు తెలిపారు.

సివిల్ దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

బిగ్ హెల్ప్ ఎడ్యుకేషన్ ఎల్లారెడ్డి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎల్లారెడ్డిలో నిరుపేద, ఆర్థికంగా వెనుకబడిన 15 మంది విద్యార్థులకు ఉచితంగా సివిల్ దుస్తులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేయటం హర్షణీయమని బిగ్ హెల్ప్ ప్రాజెక్ట్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బిగ్ హెల్ప్ ప్రాజెక్ట్ చైర్మన్ చిరంజీవులు మాట్లాడుతూ.. 15 మంది విద్యార్థులకు ప్రతినెలా వస్తువులను అందించడంలో భాగంగా నవంబర్, డిసెంబర్ నెలల వస్తువులను సంక్రాంతి పండుగ సందర్భంగా రూ.15వేల విలువైన సివిల్ డ్రెస్‌లను, రగ్గులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.బాలకిషన్, ఉపాధ్యాయులు బిగ్ హెల్ప్ సంస్థ పేద విద్యార్థులకు సహాయం చేస్తున్నందుకు సంస్థ చైర్మెన్ షేఖ్ చాంద్ పాషాకు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధిరాములు, రమేశ్, రవీందర్, రాజశేఖర్, శ్రీనివాస్, మురళి, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ పాల లావణ్య మల్లేష్

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని సర్పంచ్ పాల లావణ్య మల్లేష్ అన్నారు. గురువారం మండలంలోని గొల్లపల్లిలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ శాఖ మేనేజర్ నరేష్ ఆధ్వర్యంలో, సర్పంచ్ పాల లావణ్య మల్లేష్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ నరేష్ మాట్లాడుతూ.. తీసుకున్న వివిధ రకాల రుణాలను సకాలంలో చెల్లించి, మరిన్ని సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఖాతాదారు బ్యాంకులో బీమా చేయించుకోవాలని, డ్వాక్రా మహిళలు లావాదేవీలను సక్రమంగా వినియోగించుకొని రూ.10లక్షల వరకు రుణం పొందవచ్చని సూచించారు. సర్పంచ్ పాల లావణ్య మల్లేష్ మాట్లాడుతూ.. కుటీర పరిశ్రమలు, చిన్న చిన్న వ్యాపారాలకు మహిళా సంఘాలు రుణాలు తీసుకొని, బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకొని, దినదినాభివృద్ధి చెందాలని సూచించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా పంట రుణాలను అందించాలని బ్యాంక్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి ఉపేందర్, ఉప సర్పంచ్ నరసయ్య గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్లను అందుబాటులో ఉంచాలి

నవతెలంగాణ-దోమకొండ

గర్భిణులకు అందజేసే న్యూట్రిషన్ కిట్లను దోమకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలని జడ్పీటీసీ తిరుమల్‌గౌడ్ అన్నారు. గురువారం డీఎంహెచ్వో లక్ష్మణ్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శోభరాణికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకొండ మండల కేంద్రంలో గల డిప్యూటీ డీఎంహెచ్ కార్యాలయంలో న్యూట్రిషన్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. దోమకొండ మండలానికి చెందిన గర్భిణీ స్త్రీలు బీబీపేట మండల కేంద్రంలోని పీఎస్సీలో న్యూట్రిషన్ కిట్లు తీసుకునేందుకు వెళ్తున్నారని అందువలన గర్భిణీ స్త్రీలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గర్భిణీ స్త్రీలకు ఇబ్బందులు కలగకుండా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. న్యూట్రిషన్ కిట్లను దోమకొండలో అందుబాటులో ఉంచుతామని డీఎంహెచ్‌ఓ లక్ష్మణ్ సింగ్ చెప్పారని తెలిపారు.

గ్రాడ్యూటీ చెక్కులు పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న చైర్మెన్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బులను కుటుంబ సభ్యులకు సొసైటీ చైర్మన్ బాలగౌని రాజాగౌడ్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సొసైటీలో విధులు నిర్వహించిన దాసరి రమేష్, అబ్దుల్ పదవి విరమణ పొంది ఇటీవల కాలంలో మరణించారు. పదవి విరమణ పొందిన తర్వాత ఎల్ఐసీ ఆఫ్ ఇండియా తరఫున వచ్చిన గ్రాజ్యువిటీ చెక్కులు రమేష్ లక్ష, అబ్దుల్ లక్ష రూ.41వేల చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుడిసె విటల్, డైరెక్టర్లు బాగారెడ్డి, కిష్టయ్య, మహిపాల్‌రెడ్డి, బాబు, లింగం, బాగయ్య, యాదమ్మ, సీఈవో మోహన్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విద్య మెలకువలతో మేధస్సు

- మండల విద్యాశాఖ అధికారి శాంతాకుమారి
- పలు మండలాల్లో టీఎంఎల్ మేళా

నవతెలంగాణ-వర్ని/లింగంపేట్/భిక్కనూర్

నూతన విద్య మెలకువలతో మేధస్సు కలుగుతుందని మండల విద్యాశాఖ అధికారి శాంతాకుమారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వడ్డేపల్లి కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ టీఎల్ఎం మేళాను నిర్వహించారు. విద్యార్థులు 30 పాఠశాలల నుంచి ఈ నెలలో పాల్గొని వారు తయారుచేసిన వివిధ రకాల ప్రదర్శన వస్తువులను ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శాంతకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తొలి మెట్టుతో విద్యార్థులు ఈ దశ నుంచి మెరుగైన



భిక్కనూర్ : మేళాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

విద్యను నేర్చుకునే విధంగా పాఠశాలలోని ఉపాధ్యాయులు గణిత శాస్త్ర సంబంధించిన సబ్జెక్టుల ద్వారా నూతన విద్య విధానంతో విద్యార్థులకు విద్యను సులువుగా నేర్పించే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దండ్ల బాలరాజు, వైస్ చైర్మన గోపాల్, ఎంపీడీవో బసిరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేందుకే మేళా

లింగంపేట్ : విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు టీఎంఎల్ మేళా ఎంతో దోహదపడుతుందని ఎంపీపీ గరీబునిసా నహీం అన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం తొలి మెట్టు కార్యక్రమంలో భాగంగా టీఎంఎల్ మేళాను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విటల్‌రెడ్డి, మండల విద్యాధికారి రామస్వామి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాయన్న, బాలమణి, ఆయా పాఠశాల చందు, ఉపాధ్యాయులు రవీందర్‌శర్మ, దామోదర్, బాల్‌రెడ్డి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాకు ఎంపిక

భిక్కనూర్ : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఉన్న ఎంపీపీఎస్ హరిజనవాడ పాఠశాల తెలుగు సబ్జెక్ట్ నందు జిల్లా స్థాయిలో నిర్వహించే టీఎల్ఎం మేళాకు ఎంపికైనట్టు ఎంఈఓ ఎల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శోభ, ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, ఉపాధ్యాయులు టి.సంధ్యను ఎంఈఓ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షులు శ్రీనివాస్ చారి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎంఈఓ ఆఫీస్ సిబ్బంది సంపత్, పాపయ్య, సీఆర్పీ ఈశ్వర్, సత్యం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి

- ఏడీఏ అపర్ణ
- పలుచోట్ల పంటల పరిశీలన

నవతెలంగాణ-భిక్కనూర్/గాంధారి/ఎల్లారెడ్డి

వ్యవసాయంలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి లభిస్తుందని ఏడీఏ అపర్ణ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో వ్యవసాయ పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పొలంలో అక్కడక్కడ భాస్వరా ధాతులోప లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. వీటి నివారణకు వారం వ్యవధిలో రెండుసార్లు 19:19:19 అనే పోషక ఎరువును లీటర్ నీటిలో పది గ్రాముల చొప్పున కలిపి పొలం మొత్తం సమానంగా పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. చీడపీడల యాజమాన్యం కొరకు మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ప్రభావం ఎక్కువగా ఉంటుందని, నివారణకు పురుగు గమనించిన వెంటనే క్లోరంట్రినిలిప్రోల్ అనే మందును 0.4 మిల్లీలీటర్ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ అనే మందును 0.4 లీటర్ నీటిలో కలిపి మొక్క సుడిలో పిచికారీ చేయాలని వివరించారు. యాసంగిలో వ్యవసాయ శాఖ చేపడుతున్న క్షేత్రస్థాయి ప్రదర్శన, భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా వాడకం గురించి, పీఎస్‌బీని వరి, ఇతర పంటలలో ఎకరాకు రెండు కిలోల ఘన జీవన ఎరువు లేదా 200 మిల్లీలీటర్ల ద్రవ జీవన ఎరువును సుమారు 100-200 కిలోల పశువుల ఎరువుతో గాని, వానపాముల ఎరువుతో గాని కలిపి పంట పొలాల్లో సమానంగా చల్లాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి అఖిలేష్ రైతులు పాల్గొన్నారు.



గాంధారి : పంటను పరిశీలిస్తున్న సహాయ సంచాలకులు

జీవ నియంత్రణ పద్ధతులలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : సహాయ వ్యవసాయ సంచాలకులు

గాంధారి : జీవ నియంత్రణ పద్ధతులలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సహాయ వ్యవసాయ సంచాలకులు రత్న అన్నారు. మండల పరిధిలోని కరక్‌వాడి గ్రామ పరిధిలో సహాయ వ్యవసాయ సంచాలకులు రత్న జీవ నియంత్రణ పద్ధతులలో సస్యరక్షణ చర్యలు చేపట్టిన మొక్కజొన్న పంటను గురువారం పరిశీలించారు. అదే విధంగా ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులతో గాంధారి రైతు వేదికలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంటల నమోదు ప్రక్రియ, పీఎం కిసాన్ ఈ కేవైసీ, రైతుబంధు, రైతు బీమా అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలి : ఏవో సంతోష్‌కుమార్

ఎల్లారెడ్డి : సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని ఎల్లారెడ్డి ఏఓ సంతోష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని రుద్రారం గ్రామంలో వరి పంటలను వ్యవసాయ అధికారి సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సంతోష్ మాట్లాడుతూ.. కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున వాటికి నివారణ చర్యలు పాటించాలని, వరి పంట నెలరోజులు లోపు అయితే మోగి పురుగు నివారణకు క్లోరాంట్రినిప్రోల్ గుళికలు ఎకరానికి 4 కిలోలు చొప్పున వేయాలని సూచించారు. అదేవిధంగా వరి పంట నేల రోజులు దాటితే మోగి పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు, అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్‌మాంకోజేబ్ 500 గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలని, రైతులు మోగి పురుగు ఉధృతి ఉన్నప్పుడు యూరియా వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు వెంకట్ రాంరెడ్డి, బయగోని సాయిలు, పర్వతల్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

సమాజ మార్పులో పత్రికలది కీలక పాత్ర

- ఎంపీపీ దశరథ్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

సమాజ మార్పులో పత్రికలది కీలక పాత్ర అని ఎంపీపీ దశరథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, స్థానిక పోలీస్‌స్టేషన్లో నవతెలంగాణ-2023 నూతన క్యాలెండర్‌ను ఎంపీపీ దశరథ్‌రెడ్డి, ఎస్ఐ అనిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దశరథ్ రెడ్డి మాట్లాడుతూ.. పత్రికలు సమాజ మార్పు కోసం పనిచేయాలని, బడుగు బలహీన వర్గాల కోసం అనునిత్యం నవతెలంగాణలో కథనాలు ప్రచురించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎస్ఐ అనిల్ మాట్లాడుతూ.. పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సవిత రెడ్డి, నవతెలంగాణ డివిజన్ ఇంచార్జ్ నరేష్, మండల విలేఖరి తిరుపతిరెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, సూర్యజిరావు, పోలీస్ సిబ్బంది పవన్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

కౌలాస్‌కోటను పరిశీలించిన ట్రెయినీ ఐఏఎస్ అధికారి



కోటను పరిశీలిస్తున్న ఐఏఎస్ అధికారి

నవతెలంగాణ-జుక్కల్

కౌలాస్ కోటను ట్రెయినీ ఐఏఎస్ అధికారి గురువారం ఆకస్మికంగా పర్యటించి పరిశీలించినట్టు జుక్కల్ డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రెయినీ ఐఏఎస్ అధికారి శీవేంద్ర ప్రతాప్ మాట్లాడుతూ.. బాన్సువాడ డివిజన్ పరిధిలోని చారిత్రాత్మకమైన కట్టడాల పరిస్థితులు ఎలా ఉన్నాయో వాటి వివరాలను సేకరించి వివరాలు పొందుపర్చానని, అనంతరం కోటలోని భవానీమాత దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీటి అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ రెడ్‌క్రాస్ ట్రైనింగ్‌కు పిట్లం విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-పిట్లం

అంతర్‌రాష్ట్ర జూనియర్ రెడ్‌క్రాస్ ట్రైనింగ్ క్యాంపునకు మండల కేంద్రం నుంచి ఏడుగురు పదవ తరగతి విద్యార్థులు ఎంపికైనట్టు రాష్ట్ర మేనేజింగ్ కమిటీ మెంబర్, జూనియర్ రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీ సభ్యులు సంజీవ్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 7 నుంచి 13వ తేదీ వరకు హర్యానా రాష్ట్రం కురుక్షేత్ర పట్టణంలో నిర్వహించే టీబీ, మలేరియా, హెచ్ఐవీ, హెపటైటిస్ బి, గ్లోబల్ వార్మింగ్, ఎన్విరాన్మెంట్, ప్రొటెక్షన్, స్వచ్ఛభారత్, డిజాస్టర్ మేనేజ్మెంట్, సోషల్ వాల్యూస్, ఐ డొనేషన్ తదితర విభాగాలపై ఏడు రోజుల పాటు కొనసాగనున్న కార్యక్రమాలకు దేశవ్యాప్తంగా ఒక్కో జిల్లా నుంచి 12 మంది విద్యార్థులను ఎంపిక చేయగా.. నల్గొండ జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపిక కాగా కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రం నుంచి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని మన్నే అంకిత ఎంపిక కాగా బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థులు జంబిగి హన్సిక, తేజస్విని, మిస్బామహీన్, కార్తీక్, శ్రీరామలక్ష్మి, రాఘవ ఎంపికవడం గర్వకారణమన్నారు. ఎంపికైన విద్యార్థులకు అభినందించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ చైర్మన్ వేణుగోపాల్, మండల చైర్మన్ గూడాల నవీన్, సభ్యులు రాజు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులు

ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడిని ఖండిస్తున్నాం

నవతెలంగాణ-బోధన్

కోటగిరి మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మల్లికార్జున్‌పై కొంతమంది ఉద్దేశపూర్వకంగా దాడి చేసి అవమానపరచడం సరికాదని ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యేశాల గంగాధర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోటగిరి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మల్లికార్జున్ అనే టీచర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గురువులను గౌరవించవలసింది పోయి గురువు స్థానంలో ఉన్న వ్యక్తిపై దాడి చేస్తూ అవమానపరచడం, మత విద్వేషాలను రెచ్చగొట్టడం ఎంతవరకు సమంజసమని అన్నారు. భారతదేశ లౌకిక దేశమని ఈ దేశంలో ఎన్నో కులమతాలు ప్రాంతాల ప్రజలు ఉన్నారని అందరి మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.

మతతత్వ సంఘాలకు చెందిన కొంత మంది ఇలాంటి దాడులు చేయడం సరికాదన్నారు. ఉపాధ్యాయుడిని అవమానించి భౌతిక దాడికి పాల్పడిన వారు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగామణి, కార్మిక సంఘం నాయకులు తిమ్మాపురం పోశెట్టి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగాధర్

పల్లె ప్రకృతి వనం స్థలం పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని సంతాయిపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పల్లె ప్రకృతి వనం కోసం ఎంపీడీవో రాజువీర్ స్థలాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంతాయిపేట శివారులోని అటవీ ప్రాంతంలో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేయడం కోసం స్థలాన్ని పరిశీలించినట్టు తెలిపారు. ప్రభుత్వం గ్రామ శివారులో పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఎఫ్‌సీ బారాని సర్పంచ్ శెట్టిపల్లి భాగ్యలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ మైపాల్, ఫీల్డ్ అసిస్టెంట్ హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

నవతెలంగాణ-భిక్కనూర్

బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని మండల ఇన్చార్జ్ సుహాసినిరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో శక్తి సంఘాలతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు విస్తృతంగా ప్రచారం చేయాలని, గ్రామ గ్రామాన పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంద్‌కు అఖిలపక్షం, వ్యాపారస్తుల మద్దతు

నవతెలంగాణ-బిచ్కుంద

హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా హిందూ దేవతలను కించపరుస్తూ మాట్లాడిన బైరి నరేష్, రేంజర్ల రాజేష్‌పై పీడీ యాక్ట్ చట్టం పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని వ్యాపార, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు సంపూర్ణ బంద్ పాటించి మద్దతు తెలిపారు. అయ్యప్ప మాలదారులు, గ్రామస్తులు, వ్యాపారస్తులు, విద్యార్థులు ముందుగా మండల కేంద్రంలోని కమ్మరి గుడి నుంచి ర్యాలీగా బయలుదేరి గాంధీచౌక్, పాత బస్టాండ్, అంబేద్కర్ చౌక్ నుంచి కొత్త బస్టాండ్ వరకు వినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

బిచ్కుంద సర్పంచ్ చెక్ పవర్ వద్దు

నవతెలంగాణ-బిచ్కుంద

ప్రభుత్వ సంక్షేమ పథకమైన ఆసరా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా సాగకుండా అవరోధం కల్పించి, దండోరా వేయించి ప్రజలకు తప్పుడు సమాచారం అందించి చట్ట ప్రకారం అధికారాన్ని దుర్వినియోగం చేసి గ్రామపంచాయతీలో అధిక సంఖ్యలో పెన్షన్ దారులు గుమిగూడి గ్రామం నందు అస్తవ్యస్త పరిస్థితి ఏర్పడే విధంగా చేసినందుకుగాను జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వుల మేరకు బిచ్కుంద సర్పంచ్ రేఖ రాజు చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ గ్రామ పంచాయతీ ద్వారా జారీ చేసే అన్ని రకాల చెక్కు డ్రాయింగ్ అధికారాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు ఎంపీడీవో ఆనంద్ తెలిపారు.

బహుజన రాజ్యాధికారంలోనే

బహుజనుల సమస్యలు పరిష్కారం

- బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు యస్.సిద్ధిరాములు

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ సమాజంలో 93శాతమున్న బహుజన ప్రజలకు రాజ్యాధికారంలో సమాన వాటా దక్కకుండా వారి సమస్యలు పరిష్కారం కావని బహుజన లెఫ్ట్ ఫ్రంట్-బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు యస్.సిద్ధిరాములు అన్నారు. గురువారం మద్నూర్ మండల కేంద్రంలో జరిగిన జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గ కమిటీ సమావేశంలో పాల్గొని ముందుగా బీఎల్ఎఫ్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలతో కలిసి బహుజన సామాజిక వర్గాలు 93శాతముంటే అందులో బీసీ కులాలే 60 శాతం ఉన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం ద్వారా సమాజాభివృద్ధికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు ధరలు పెంచడం మరోవైపు ప్రజల మధ్య విభజన అగ్గిరాజేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్, జుకల్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కర్రెవార్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్ధిరాములు

డ్రైనేజీ పనులకు భూమిపూజ

నవతెలంగాణ-ముప్కాల్

రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతో గురువారం బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామంలో (దుబ్బ) ఎస్సీ వాడకు ఎంపీటీసీ నిధులు రూ.2.50 లక్షలు మంజూరు కావడంతో డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ నోముల రవితో కలిసి ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్ భూమిపూజ చేశారు. నిధుల కేటాయింపులో మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు ప్రశాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు నోముల మోహన్, పీఆర్ఈ షరీఫ్, పార్టీ నాయకులు ముప్కారం రాము, నార్ల రాజు, కోట మురళి, తలారి రాజేందర్, నాలరి రాజేందర్, నరేష్, జక్క మోహన్ తదితరులు పాల్గొన్నారు..

ప్రజా కవులు వర్ధిల్లాలి

- కామ్రేడ్ సుబ్బారావు సంతాప సభ

నవతెలంగాణ-ఆర్మూర్

అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ సుబ్బారావు విప్లవ జోహార్లు అర్పిస్తూ. గురువారం పట్టణంలోని లోని కుమార్ నారాయణ భవన్ లో పి డి ఎస్ యు పి వై ఎల్ అరుణోదయ ప్రజా సంఘాల ఆ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. దీనికి అరుణోదయ అనిల్ అధ్యక్షత వహించగా, ముఖ్య వ్యక్తులుగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు దేవారం,, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు కిషన్, లు మాట్లాడుతూ ,,, 1970నుంచి నాలుగు దశాబ్దాలుగా సాంస్కృతిక సైనికుడిగా పని చేశాడని తెలిపారు. కళాకారుడిగా, రచయితగా పోరాటాల్లో తన పాటని వినిపించాడని తెలిపారు. కార్యక్రమంలో ప్రజపంథా నాయకులు శేకర్, నాజిర్, పీడీఎస్‌యూ ఏరియా కార్యదర్శి నిఖిల్, నాయకులు వినోద్,నవీన్ , ఆకాష్,వంశీ , సహెబ్రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాగా బోధన్‌కు అన్ని అర్హతలు..

జిల్లా కోసంకొనసాగుతున్న దీక్షలు

నవతెలంగాణ-బోధన్

బోధన్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయవలసిందేనని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు గొర్రెపాటి మాధవరావు అన్నారు. బోధన్ జిల్లా సాధనకై బోధన్ పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల దీక్షలకు ఆయన గురువారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. అన్ని అర్హతలున్న బోధన్‌ను ప్రత్యేక జిల్లా చేయాలనడం న్యాయ సమ్మతమని అన్నారు. బోధన్ జిల్లా సాధన కోసం బోధన్ న్యాయవాదులు స్పందించి ఉద్యమం ప్రారంభించటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. బోధన్ జిల్లా సాధనకు ఈ ప్రాంత ప్రజలు ఉద్యమించడం హేతుబద్ధమేనని అన్నారు. జిల్లా సాధనకు మానవ హక్కుల వేదిక పూర్తి మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. ఈ దీక్షలలో న్యాయవాదులు నాయక్ సాయిలు, పాల్దే శంకర్, న్యాయవాదుల గుమస్తాల ప్రతినిధి సందీప్ పాల్గొన్నారు. దీక్షలను పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ దీక్షలో పాల్గొన్న వారికి పూలమాలవేసి రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. దీక్ష శిబిరం సందర్శించిన మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు పూర్తి సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని అర్హతలున్న బోధన్‌ను ప్రత్యేక జిల్లా చేయాలనడం న్యాయ సమ్మతమని అన్నారు. ఈ దీక్షలకు విద్యార్థి జేఏసీ నాయకులు శివకుమార్, పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్. శైలేందర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు గౌతమ్ కుమార్, ఉపాధ్యక్షులు కార్తిక్, కాంగ్రెస్ నాయకులు ఖాజా పయాజ్ ఉద్దీన్, జాన్సన్ జయకర్, గంగాప్రసాద్ అప్పా తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు సీహెచ్.వి. హనుమంతరావు, అర్జున్ రండర్, గంగారెడ్డి, ఈశ్వర్, చంద్రకాంత్, మురహరి, టీ.శంకర్, దత్తాత్రి కులకర్ణి, భానోత్ రమేష్, ధర్మయ్య, ప్రకాష్, అడ్లూరి శ్రీనివాస్, అజయ్, శేఖర్, గిరిధర్ రాజ్, కోటేశ్వర్‌రావు, న్యాయవాదుల గుమస్తలు వై.గంగాధర్, జమ్మర్‌ఖాన్, హన్మండ్లు, ఖైసర్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

గాంధారి ప్రాథమిక సహకార సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-గాంధారి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన క్యాలెండర్‌ను సొసైటీ చైర్మన్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎన్‌డీసీసీబీ, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ పెద్దబూరి సాయికుమార్, గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్‌తో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ఉదల్ సింగ్, సొసైటీ డైరెక్టర్లు ధోల్ల సాయిలు, తాడ్వాయి సంతోష్‌కుమార్, రోడ్డ అశోక్‌రెడ్డి, కోనింటి మణెవ్వ పోచయ్య, గోవింద్ గణపతిరావు, సొసైటీ క్లర్క్ గాండ్ల సాయిలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్వే



నవతెలంగాణ-గాంధారి

మండలంలోని వివిధ గిరిజన తండాలలో మౌలిక వసతులపై గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీర్ శంకర్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ బాలు, ఎస్టీ హాస్టల్ వార్డెన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

- రూ.17,970 స్వాధీనం

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రేకులపల్లి గ్రామా శివారులో పేకాట స్థావరంపై ఎస్ఐ వంశీ కృష్ణ రెడ్డి దాడి చేసి ఎనిమిది మంది పేకాటఆడుతున్న వారిని పట్టుకున్నారు. వారివద్దనున్న 17, 970 నగదును స్వాధీన పరుచుకొని కేసునమోదు చేసి కోర్టుకు అప్పచెప్పనున్నట్లు గురువారం తెలిపారు.

నేడు ఎల్లారెడ్డి బంద్‌కు పిలుపు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

నాస్తిక ముసుగులో హిందూ దేవతలను దూషిస్తున్న వారిపై పీడీ యాక్ట్ అమలు చేయాలని, దానికి మద్దతుగా శుక్రవారం ఎల్లారెడ్డి బంద్‌కు హిందూ సంఘాలు పిలుపునిచ్చాయి.

బాలికకు అభినందన

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జైతాపూర్ గ్రామానికి చెందిన దయ్యాల లిఖిత ప్రపంచస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్ 12 ఛాంపియన్‌షిప్ పోటీలో భారత జట్టు తరుపున పాల్గొని బెస్ట్‌ప్లేయర్‌గా ఎంపికైన సందర్భంగా గ్రామ పంచాయతీ తరపున బాలికకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ఎం.గంగామోహన్, పీఈటీ మల్లేష్‌గౌడ్, ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్, జైతాపూర్ సర్పంచ్ శ్రీలక్ష్మి రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-సదాశివనగర్

అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన రైతు పయ్యావుల రాములు తన ఇంటిలో ఆత్మహత్య చేసుకోవడంతో వైయస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నీలం సుధాకర్ ఆధ్వర్యంలో ఆ కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. అలాగే రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. మృతుడు రాములు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా పది లక్షల రూపాయలు ప్రకటించాలని జిల్లా అధ్యక్షుడు నీలం సుధాకర్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా స్పందించి మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి నియోజకవర్గ యూత్ అధ్యక్షులు పి.రాము, పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ తాహిర్, కామారెడ్డి మండల అధ్యక్షులు కళ్లెం రాజు, సదాశివనగర్ మండలాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

శబరిమలై బయలుదేరిన అయ్యప్ప స్వాములు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మాల ధరించిన స్వాములు ఇరుముడి కట్టుకొని శబరిమలై అయ్యప్ప దర్శనానికి గురువారం సాయంత్రం బయలుదేరారు. కార్యక్రమంలో స్వాములు చంద్రమౌళి, శ్రీకాంత్, రవి గౌడ్, గోపి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రథం తయారీకి రూ.35 వేల విరాళం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నూతన రథం తయారీకి స్థానిక శ్రీ వెంకటేశ్వర రైస్ యజమాని లింబాద్రి రూ. 35 వేల విరాళం అందజేశారు. గురువారం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. లింబాద్రికి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బద్దం రాజేష్, నూకల బుజ్జి మల్లయ్య, నూకల మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గోడ గడియారాలు పంపిణీ



నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

సారంగాపూర్‌లోని బాజిరెడ్డి, కేసీఆర్, జగన్, కారు బొమ్మతో ఉన్న గడియారాలను సారంగాపూర్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అక్బర్ నవాజుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. అనంతరం అక్బర్ నవాజుద్దీన్ మాట్లాడుతూ... టీఆర్ఎస్ పార్టీ, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పైన అభిమానాన్ని చాటుకుంటూ ఆయన ఆశీర్వాదం సారంగాపూర్ ప్రజలు, మైనార్టీ ప్రజలకు ఎప్పుడు అండగా ఉండాలని అన్నారు. తాము ఎప్పుడు ఎమ్మెల్యేకు అండగా ఉంటామని తెలిపారుఉ. ఇంకా రూరల్ ఎమ్మెల్యే గోవర్ధన్ ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో రాంనగర్ ఎంపీటీసీ స్వామి టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మహమ్మద్ అఫ్జల్, గణేష్, నర్సాగౌడ్, గఫర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం ఉంటేనే విజయం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యార్థులు నిర్ణీత లక్ష్యం ఏర్పరచుకొని సాధన దిశగా కృషి చేయాలని, లక్ష్యం ఉంటేనే విజయం దరిచేరుతుందని, లక్ష్యం లేని వారికి విజయం వరించిందని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీలోని సెమినార్ హాల్‌లో లాకాలేజ్ టీయూ మెయిన్ క్యాంపస్ లో ఆర్టిఐ యాక్ట్‌పై అవేర్‌నెస్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. సమావేశంలో కీనోట్ స్పీకర్‌గా డాక్టర్ గుగులోత్ శంకర్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు, బహుజన వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. అవినీతి రహిత సమాజ నిర్మాణంకోసం సమాచార హక్కు చట్టం ప్రారంభిం చారని అన్నారు. సమాచారంకోసం దరఖాస్తు చేసిన 30 రోజులలో సంబంధిత అధికారి సమాధానం ఇవ్వాలని లేకుంటే పైఅధికారికి తెలపాలని వారిపైన జరిమానా వేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో కమిషనర్ గుగులోత్ శంకర్ నాయక్ కు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు .ఈ సమావేశానికి ప్రొఫెసర్ ఆరతి ప్రిన్సిపల్ అధ్యక్షత వహించారు. సమావేశంలో నిజామాబాద్ అర్డిఓ రవి, తహసిల్దార్ శ్రీనివాస్ రావు, ఎస్ ఐ కచ్చా కాయల గణేష్, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న వక్తలు

టీచర్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించండి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

టీచర్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. బీజేపీ, విశ్వహిందూ పరిషత్ వాళ్ల టీచర్‌ని అడిగిన వినాయక చందా ఇవ్వనందుకే ఆగస్టు నెలలో జరిగిన విషయంపై ఇప్పుడు సరస్వతిని టీచర్ కించపరిచారని, విద్యార్థులకు పాఠాలు బోధించడం లేదని అ టీచర్ పై అసత్య ప్రచారం చేస్తున్నారని జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు దేశెట్టి సాయిరెడ్డి, ఐఎఫ్‌టీయూ నగర కార్యదర్శి శివకుమార్ అన్నారు. గురువారం నగరంలో విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నాగజ్యోతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీచర్‌పై ఫిర్యాదు చేయాలనుకుంటే సంభందిత అధికారులకు తెలియజేయాలి కానీ ఆ టీచర్‌ను అవమానించి బలవంతంగా గుళ్ళోకి తీసుకెళ్ళి బొట్టు పెట్టి క్షమాపణ చెప్పించడం దుర్మార్గమని అన్నారు. విద్యాలయాల్లో మతోన్మాదుల ప్రమేయం సిగ్గు చేటని అన్నారు. విద్యార్థులకు సిలబస్‌లో ఉన్న పాఠం చెబితే వీరికొచ్చే ఇబ్బంది ఏంటో తెలపాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు విద్యా సంస్థల్లో లౌకిక విలువలను కాపాడాలని, రాజకీయ, మత సంఘాల ప్రమేయాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. తక్షణమే టీచర్ విధులకు ఆటంకం కలిగించి, బలవంతంగా గుళ్ళోకి తీసుకెళ్ళి బొట్టు పెట్టి అవమాన పరిచిన వారందరినీ పోలీసులు గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకొని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనలో దగ్గరుండి సహకరించిన ఎంఇఓ, హెచ్ఎంలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వనమాల సత్యం, బండమీది నరసన్న, భాస్కర్ ,మోహన్ గంగాధర్, ఎల్లప్ప, అశోక్, రాజు మనోజ్, సునీల్ పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 7, 8న జాతీయ వర్క్‌షాప్

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో రెండు రోజుల పాటు "క్రిప్టోగ్రఫీ ,దాని ఉపయోగాలు' అనే అంశంపైన ఈనెల 7, 8 తేదీల్లో జాతీయ వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు కళాశాల సెక్రెటరీ అల్జాపూర్ దేవేందర్ గురువారం తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తలుగా ఐఐటీ లక్నో ప్రొఫెసర్ ధనుంజయ, డి ఆర్ డి ఏ నుండి డాక్టర్ ఇండీవర్ గుప్తా, డాక్టర్ గిరీష్ మిశ్రా, జేఎన్టీయూ హైదరాబాద్ నుండి ప్రొఫెసర్ శ్రీనివాస్ రావులు పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో క్రిప్టోగ్రఫీ టెక్నాలజీపై సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో ఎంతగానో ఆదరణ లభిస్తుందని, క్రిప్టోగ్రఫీ అంశాలు నేర్చుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. కోడింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, నెట్వర్క్ సెక్యూరిటీ ఇతర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలానే సదుద్దేశంతో ఈ జాతీయ వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో వివిధ క్రిప్టోగ్రఫీ అంశాలపై నిష్ణాతులైన ప్రొఫెసర్లు, శాస్త్ర వేత్తలు, వక్తలు స్కాలర్లు, విద్యార్థులు ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 450 మంది వివిధ కళాశాలలకు చెందిన ప్రొఫెసర్లు, పరిశోధకులు,కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొననున్నారు.ఈ సందర్భంగా వర్క్‌షాప్ బ్రోచర్లు, పోస్టర్లను కళాశాల సెక్రెటరీ శ్రీ అల్జాపూర్ దేవేందర్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీ ఆర్కే పాండే, వైస్ ప్రిన్సిపల్ శ్రీ నరేందర్, హెడ్ అఫ్ ద డిపార్ట్మెంట్ లక్ష్మణ్, వర్క్ షాపు కో కన్వీనర్ కృష్ణ చైతన్య టీచింగ్ సభ్యుల సమక్షంలో విడుదల చేశారు.

బైరి నరేష్, రెంజర్ల రాజేష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

నవతెలంగాణ-ముప్కాల్

సామాజిక మాధ్యమాల్లో తరచుగా హిందువులపై, హిందు దేవతలపై అసభ్యకరంగా మతుడుతున్న బైరి నరేష్, రెంజర్ల రాజేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించాలని ఆర్యవైశ్య సంఘ సభ్యులు పల్లికొండ గోపీనాథ్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు దారులు పల్లికొండ గోపీనాథ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత దాదాసాహెబ్ అంబెద్కర్ హిందు సాంప్రదాయం పట్ల ఎంతో గౌరవంతో ఉన్నారని, హిందూ మనోభావాలను ఎంతో గౌరవించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. బైరి నరేష్, రెంజర్ల రాజేష్ లపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పునరావాస కేంద్రానికి కుర్చీల వితరణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలకేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో కొనసాగుతున్న దివ్యాంగుల పునరావాస కేంద్రానికి మండల ఉపాధ్యాయుల సంఘం (పీఆర్‌టీయూ) ఆధ్వర్యంలో గురువారం ఐదు చైర్లు డోనేట్ చేశారని వికలాంగుల సీసీ తెలిపారు. విద్యార్థులకు కూర్చోవడానికి మ్యాటు తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్, పీఆర్‌టీయూ నాయకులు ప్రవీణ్ రెడ్డి, నాగభూషణం, రవి, గోపి, వికలాంగుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంట రాములు జ్ఞాపకార్థం స్మార్ట్ టీవీ బహూకరణ

నవతెలంగాణ-ధర్పల్లి

పీఆర్టీయూ ధర్పల్లి అధ్యక్షుడు వెంకట్ రాజారెడ్డి బామ్మర్ది, గడ్కోల్‌కు చెందిన కుంట వివేక్ రెడ్డి తన వివాహ దినోత్సవం సందర్భంగా తన తాత కుంట రాములు జ్ఞాపకార్థం మండల కేంద్రంలోని భవిత పాఠశాలకు స్మార్ట్ టీవీని గురువారం బహూకరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి , పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వేంకటేశ్వర్ గౌడ్ , మండల ప్రధాన కార్యదర్శి సతీశ్ కుమార్ , ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. భవిత ఉపాధ్యాయులు మురళి , సురేష్ దాత వివేక్ రెడ్డికి , వెంకట్ రాజారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో మాజీ సర్పంచ్
చిలుక కిష్టయ్య స్మారకార్థం నిర్వహిస్తున్న మెమోరియల్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. చిలుక కిష్టయ్య కుమారుడు ప్రమోద్ హాజరై టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ లో 30 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రారంభ మ్యాచ్ లో జీసీసీ(సి) జట్టు, హస కొత్తూరు జట్టు తలపడ్డాయి. కార్యక్రమంలో పెద్దలు గుండోజి దేవేందర్, ఆర్ఎంపీ వైద్యులు చింత హనుమంతు, మాజీ ఉప సర్పంచ్ సుంకేట బుచ్చన్న, జీసీసీ పాలకవర్గం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

60వేల విలువైన క్రీడాపరికరాలు అందజేత

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పోతాంగల్ కలన్ ప్రభుత్వ పాఠశాలకు బాల్కొండ మండలానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త దయానంద్‌రెడ్డి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పదకొండు ప్రభుత్వ పాఠశాలకు రూ.60వేల విలువగల క్రీడ పరికరాలు అందించినట్టు వాలీబాల్ కోచ్ లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. బుధవారం బాల్కొండ మండల కేంద్రంలోని పాండురంగ కళ్యాణ మండపంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్ని కోట్ల ఆస్తి ఉన్నా సహాయం చేసే దాతృత్వం కొంతమందికే ఉంటుందని క్రీడ పరికరాల దాత దయానంద్‌రెడ్డిని అభినందించారు. కామారెడ్డి జిల్లా నుంచి పోతాంగల్ కాలాన్ పాఠశాలను ఎంపిక చేయడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు సర్పంచ్, వడ్లబారాజ్, గ్రామ నాయకులు అభినందలు తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించే విధంగా విద్యార్థులకు ఎల్లపుడూ సేవ చేస్తూ ఉంటానని దయానంద్‌రెడ్డి తెలిపినట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. దయానంద్‌రెడ్డి ప్రోద్బలంతో క్రీడల్లో రాణిస్తామని క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేశారు.

మద్దికుంట ఆలయాన్ని దర్శించుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంటలో వెలసిన శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని కామారెడ్డి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ శివరాం నాయక్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆలయ పూజారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ చరిత్రను పూజారులు వివరించారు. నిత్యం పారే జలబుగ్గను తిలకించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు నిత్యాన్నదానం, వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయడంపై ఆలయ కమిటీని అభినందించారు. అనంతరం వారికి శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు, స్వామి వారి జ్ఞాపకం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోజారి లచ్చిరెడ్డి, పూజారి గణేష్ పంతులు, కోర్టు కానిస్టేబుల్ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కులు అందజేత


రైతుబీమా చెక్కులు అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

రైతు బీమా పథకంలో భాగంగా చనిపోయిన చనిపోయిన నలుగురు రైతు కుటుంబాలకు ప్రొసిడింగ్ కాపీలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్మన్ రజిత ఎల్లయ్య యాదవ్, సొసైటీ చైర్మన్ మల్కారెడ్డి, స్థానిక ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ బాబా, మనిషారెడ్డి, నాయుడు పోతన స్రవంతి, టీఆర్ఎస్ మండలాధ్యక్షులు శ్రీరామ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

7న బూత్ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-రాజంపేట్

7న జరిగే బూత్ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని బీజేపీ కామారెడ్డి పాలక్ సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పదాధికారులతో శివాయిపల్లి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు దేవిరెడ్డి గంగారెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సంపత్‌రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు బక్కి సంధ్య, శక్తి కేంద్ర ఇంచార్జిలు మనోహర్‌రెడ్డి, రాజేందర్‌రావు, గ్రామాల అధ్యక్షులు సాయిరెడ్డి, రాము, దుర్గాప్రసాద్, కుమ్మరి రమేష్, బూత్ అధ్యక్షులు రాజిరెడ్డి, రాజు, సంజీవరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

నేను కొయ్యలకర్ ఉదయ్ కిరణ్, తండ్రి : రాజేశ్వర్, ఇంటి నెం : 3-66/2, జేపీ కాలనీ, గ్రామం, మం : ముప్కాల్, జిల్లా : నిజామాబాద్. 2022-12-19 తేదీ రోజు ముప్కాల్ నుంచి బాల్కొండకు బైక్‌పై వెళుండగా మార్గమధ్యలో నా ఓరిజినల్ పాస్‌పోర్ట్ నెం : V9667587 ఎక్కడో పడిపోయినది. ఎవరికైనా దొరికినచో 9392284817 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.